
# సముద్ర గుట్టు గుర్తించొచ్చు..!


- ప్రగతినగర్‌లో ఓషియన్ శాట్-2 గ్రౌండ్ స్టేషన్ ప్రారంభం
- హాజరైన కేంద్ర మంత్రి విలాస్‌రావు, సీఎం కిరణ్, ఇస్రో చైర్మన్ రాధాకృష్ణన్
- ఇదో మైలురాయి అన్న కేంద్ర మంత్రి
- రాష్ట్రానికి ఏటా 20వేల కోట్ల ఆదాయమన్న సీఎం
- ఈ వ్యవస్థతో సునామీ, ఆటుపోట్లు ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు



'ఓషియన్ శాట్-2 గ్రౌండ్ స్టేషన్' ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న సీఎం.. చిత్రంలో విలాస్‌రావు దేశ్‌ముఖ్, శ్రీధర్‌బాబు తదితరులు

హైదరాబాద్, సెప్టెంబర్ 12 (టీ న్యూస్):

సముద్ర గర్భంలో ఉద్భవించే మార్పులను ఎప్పటికప్పుడు గుర్తించేందుకు వీలుగా రూపొందించిన అత్యాధునిక శాటిలైట్ వ్యవస్థ 'ఓషియన్ శాట్-2 గ్రౌండ్ స్టేషన్'ను కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ మంత్రి విలాస్‌రావ్ దేశ్‌ముఖ్, ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి సోమవారం లాంఛనంగా ప్రారంభించారు. రంగారెడ్డి జిల్లాలోని ప్రగతినగర్‌లో గల ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓషియన్ ఇన్‌ఫర్మేషన్ సర్వీసెస్‌లో ఈ స్టేషన్‌ను నేషనల్ రిమోట్ సెన్సింగ్ ఏజెన్సీ, ఇస్రో సంయుక్తంగా ఏర్పాటు చేశాయి. స్టేషన్‌ను ప్రారంభించిన అనంతరం కేంద్ర మంత్రి విలాస్‌రావ్ దేశ్‌ముఖ్ మాట్లాడారు. గ్రౌండ్ స్టేషన్ ఏర్పాటు శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఓ మైలురాయి అని అభివర్ణించారు. దీని వల్ల మత్స్యకారులకు చేపల లభ్యతపై తాజా సమాచారాన్ని పొందడమే కాకుండా, తక్కువ శ్రమతో ఎక్కువ ఆదాయాన్ని పొందేందుకు వీలు కలుగుతుందన్నారు. లక్ష మంది వరకు మత్స్యకారులు ఈ వ్యవస్థ వల్ల లబ్ధిపొందుతారని చెప్పారు. దీన్ని రూపొందించిన శాస్త్రవేత్తలను ఆయన అభినందించారు. అనంతరం ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక రంగాల్లో సాధిస్తున్న అభివృద్ధి సామాన్య ప్రజలకు ఉపయోగపడాలన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 960 కిలోమీటర్ల మేర సముద్ర తీర ప్రాంతం ఉందని, షిప్పింగ్ తదితర కార్యకలాపాల వల్ల ఏటా రూ. 11 వేల కోట్ల ఆదాయం వస్తోందని తెలిపారు. సముద్ర జలాల అటుపోట్లు, వాతావరణం షిప్పింగ్, సునామి తదితర అంశాలకు సంబంధించి ఎప్పటికప్పుడు తాజా సమాచారాన్ని అందించేందుకు ఈ శాటిలైట్ వ్యవస్థ మత్స్యకారులకు ఎంతగానో ఉపయోగపడుతుందని వివరించారు. ఓషన్ శాట్ 2 వల్ల సముద్ర వనరుల ద్వారా సంవత్సరానికి రూ. 11వేల కోట్లు వచ్చే ఆదాయం రూ. 20వేల కోట్లుకు చేరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.


ఇస్రో చైర్మన్ కే. రాధాకృష్ణన్‌తో మాట్లాడుతున్న సీఎం కిరణ్, విలాస్‌రావు దేశ్‌ముఖ్

**శ్రీహరి కోటలో రాకెట్, ఉపగ్రహాలను జోడించే పరిశ్రమ**

ఇస్రో చైర్మన్ కె.రాధాకృష్ణన్ మాట్లాడుతూ త్వరలో నెల్లూరు జిల్లా శ్రీహరి కోటలో రాకెట్‌ను, ఉపగ్రహాన్ని జోడించే పరిశ్రమను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. వాతావరణ పరిశోధనకు వచ్చే నెలలో 'మేఘు- ట్రాపిక్స్' అనే ఉపగ్రహాన్ని ప్రయోగించనున్నామని, దీని తర్వాత సముద్ర వాతావరణ పర్యవేక్షణకు 'సరల్' అనే ఉపగ్రహాన్ని ప్రయోగిస్తామని ఆయన వెల్లడించారు. అంతరిక్ష వ్యవస్థలాగే దేశంలో వ్యయసాయం, నీటిపారుదల, ఖనిజాలకు సంబంధించిన ఓ ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటుచేయాలని విలాస్‌రావ్‌కు ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే భిక్షపతి యాదవ్, రంగారెడ్డి జిల్లా జాయింట్ కలెక్టర్ జగన్నాథం, ఎర్త్ కిషన్ చైర్మన్ శైలేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## సముద్ర ప్రమాదం ముందే తెలుస్తుంది

ఓషియన్ శాట్-2 గ్రౌండ్ స్టేషన్ ద్వారా సముద్రంలోని ప్రమాదాలను ముందే పసిగట్టొచ్చు. సునామీ వంటి భారీ ముప్పులను కూడా గుర్తించొచ్చు. ఇటీవల అంతరిక్షంలో ఇస్రో ప్రయోగించిన ఓసియాన్ శాట్-2 ఉపగ్రహం నుంచి ఎప్పటికప్పుడు సమాచారాన్ని ఈ స్టేషన్ సేకరిస్తుంది. ఆ సమాచారం ఆధారంగా సముద్రంలోని మార్పులను విశ్లేషిస్తుంది. సునామీ, ఆటుపోట్లను ముందస్తుగా కనిపెడుతుంది. ఉత్తరాన గల బంగాళాఖాతం, పడమరాన గల అరేబియా సముద్రాల నుంచి దాదాపు 5,000 కిలోమీటర్ల వరకు సంకేతాలు అందేలా 7.5 మీటర్ల వ్యాసం గల యాంటెన్నాను ఈ గ్రౌండ్ స్టేషన్‌పై అమర్చారు. ఈ యాంటెన్నా సముద్రాలపై పరిశోధనకు ఎంతో తోడ్పడుతుంది. ఉపగ్రహాల సమాచారాన్ని కూడా స్వీకరించే సామర్థ్యం కలిగి ఉంటుంది.